

4.8271
NAR

# నగోడిప

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

# మా గురించి

1953 జనవరిలో ఈ గ్రంథముయొక్క మొదటి ముద్రణ జరిగింది. ఆలంపురం సారస్వత సభల్లో శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావుగారు అప్పుడు దీనికి ఆవిష్కరణ జరిపారు. ఆసందర్భమున వారు వెలిబుచ్చిన అమూల్యాభిప్రాయాలు ఈ గ్రంథములో వేరేచోట చదువుతారు. మీరు

ఈ గ్రంథము రెండవ ముద్రణను కొన్ని కొత్తగేయాలతో అందించుటకు అనుమతించిన శ్రీ కాళోజి నారాయణరావుగారికి, గ్రంథము అందచందాలను తీర్చుటలో సాయపడిన మిత్రులకు, ముద్రణభారమును తీర్చుటకు తోడ్పడిన మహాశయులకు, సభ్యులుగాచేరి మమ్ము ప్రోత్సహించిన అభిమానులకు, మొదట, ఇప్పుడు గ్రంథపరిచయమును వ్రాసిన మహాకవి శ్రీ దాశరథిగారికి కృతజ్ఞులము.

విన్నవించు

12-12-53
సికింద్రాబాదు.

వట్టికోట ఆళ్వారుస్వామి

స్థాపకుడు, ప్రకాశకుడు.

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10755

# దేశోద్ధారక గ్రంథమాల

## విజ్ఞప్తి

ఆంధ్ర సోదరులకు అవసర గ్రంథముల నందించు ఆశయముతో బహుధాన్య (౧౯౩౮) సంవత్సరంలో కీ॥ శే॥ దేశోద్ధారక, విశ్వదాత, కళాప్రపూర్ణ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి స్మారక చిహ్నముగా స్థాపింపబడిన ఈ గ్రంథమాలద్వారా లోగా దేశకాలపరిస్థితులనుబట్టి రాజకీయ విజ్ఞానమునిచ్చి, స్వాభిమానమునుపురికొల్పి, సత్వర కర్తవ్యమును తెలుపు ౧౨ గ్రంథములనుప్రచురించి, దేశభక్తులయొక్కయు, మేధావంతుల యొక్కయు మన్ననలను పొందినాము. పిమ్మట మొత్తము భారత దేశముతోపాటు హైద్రాబాదులో ఏర్పడిన రాజకీయ అసాధారణ పరిస్థితులలో గ్రంథమాలను నడిపింపజాలలేదు. ౧౨ సంవత్సరముల తర్వాత కొంత స్థిమితము కలిగి, తిరిగి గ్రంథ ప్రచురణకు పూనుకొను అవకాశము కలిగింది. గ్రంథమాల స్థాపనకాలములో మాముందుండిన కర్తవ్యము నేటివరకును తీరలేదని భావిస్తున్నాము.

"మనిషి యే పంథా నవలంబించవలయునో అని ఆలోచించుటకు ముందు వివిధ పంథాలను తెలిసికొనుట ముఖ్యము." కాబట్టి మేము ప్రచురించు ప్రతి గ్రంథము దేశీయుల ఆకాంక్షలను, హక్కులను, బాధ్యతలను దృష్టియందుంచుకొని కర్తవ్యములను సూచించునదిగా నుండును. ఇట్టి మా కృషికి చేయూతనిచ్చి మా ఆశయ సఫలతకు దేశీయులు మమ్ము ప్రోత్సహించెదరని విశ్వసిస్తూ, విజ్ఞులగువారి సర్వ సహాయాలపైమాత్రమే ఈ మా వ్యవస్థను నిర్వహించగలుగుదుమని విశ్వసిస్తున్నాము. పది రూపాయలకు తక్కువకాని విరాళమును మీనుండి అభ్యర్థిస్తూ, అట్టిమొత్తం మేరకు, వెలువడే గ్రంథాలు అందజేయబడునని మనవి చేస్తున్నాము.

ఇట్లు విన్నవించు

సర్వోదయ ప్రెస్,
మహాకాళి వీధి,
సికింద్రాబాదు.

పట్టికోట ఆళ్వారుస్వామి
స్థాపకుడు, ప్రకాశకుడు.

A0UA105B149

# 'నాగొడవ' లో పడకముందు

ఆనందమో, ఆవేదనో కలిగినప్పుడు వచ్చిన భావాన్ని వెలిబుచ్చడం జరిగింది. అది యితరులకు కాకున్నా వెలిబుచ్చినవానికి బాగా నచ్చింది. ఇతరులకుకూడా నచ్చితే విశేషం. ఈ విశేషధర్మం కైతకే మాత్రం ఆధారంకాదు. దానికి మూలం, ప్రాణం కవికి అప్పుడప్పుడు కలిగిన ఆవేదన, ఆనందం మాత్రమే.

ఎన్నో సంఘటనలు జరుగుతుంటవి మన చుట్టుపట్టు. ఒకే సంఘటన అందరినీ ప్రభావితుల చేయదు, ఒకేరీతిగా అసలే చేయదు.

ప్రసారయంత్రం ఒకటే అయినా స్వీకరించే యంత్రాలు తమతమ శక్తితో దానిని గ్రహిస్తవి. యంత్రాలలో అన్నివిధాల సమాన శక్తిగల పరికరాలను నిర్మించవచ్చు. మానవుల నిర్మాణం అట్లా జరగలేదు. మనకు ఏదైనా "శక్తినిబట్టి సాక్షాత్కారం, భావానుగుణ్యం రూపం."

1—1—1953 కాళోజి.

నాదాల మునిగి

ఆనందాల తేల

వాసనల దీర్చు

సువాసనల గోల

జన్మించెదను

దేవసర్పమై నేను !

# పీఠిక (ప్రథమ ముద్రణ)

కాళోజీ కవిత్వం సమాజానికి హెచ్చరిక వంటిది. అతడు ఒక్కమాటు సమాజంవైపు కన్నెత్తి నిశితంగా చూస్తే సమాజం నిలువునా గజగజా వణికిపోయి తనలో తరతరాలనుండి దాచుకున్న కుళ్లను ఒక్కమాటు బయటపారేస్తుంది—అట్లా చేయకుండా ఇంకా రహస్యంగానే వుంచటం అతనిముందు సాధ్యంకాదు గనుక. అతనికి గుడ్డి ఆశలు లేవు. తాను చూస్తున్నదీ, తనకు తోస్తున్నదీ రాస్తాడు. నిజం ఆలోచిస్తే కాళోజీ శాస్త్రజ్ఞుడు—శాస్త్రజ్ఞుడు గర్భితమై వున్న కవి.

కాళోజీ, వ్యత్యాసాలనుగూర్చి,

"కమ్మని చకిలాలొకచోట,
గట్టిదవడ లింకొకచోట;
వాసననూనియ లొకచోట,
మాసిన తల లింకొకచోట"

అని రాస్తూ లోకాన్ని రెండుభాగాలుగా నిర్దాక్షిణ్యంగా, నిర్భయంగా బద్దలుకొట్టిననాడు లోకమంతా ఆశ్చర్యపోయి అతనివంక చూచింది. ఎందుకంటే కాళోజీ "సామ్యవాది" కాడు.

"కుటిలమతులు, దేబెమొగాలు
జగతిలో రెండే రెండు రకాలు"

అంటాడు ఈయన. ఎందుకంటాడో విన్నారా! ఈనాడు కుటిలుడుకాని అమాయకుడల్లా దేబెముఖంకింద లెక్క గనుకనూ, కుటిలమతి కానిది స్వార్థం చేకూరడంలేదు గనుకనూ. ఈ గేయం ఆసాంతం చదివితే సముద్రమథనం జ్ఞాపకం వస్తుంది. ఇదేగా ఆనాడు "వాళ్ళు" చేసింది, ఈనాడు "వీళ్ళు" చేస్తున్నది?

అతనిలో కళలుకట్టే శక్తి లేదు. అతడు చెప్పినవి, చెబుతున్నవి, చెప్పనున్నవి సత్యాలు—స్థూలదృష్టికికూడా సులభంగా అందే నిజాలు.

జగత్తులో సామాన్యులను దగాచేయడం ఎంత సులభమో, దానికి కావలసిన కొద్దిపాటి చాకచక్యం ఏమిటో,

"దండెకొట్టు తెలివే చాలు
జోకవచ్చు గింజలు తాలు"

లో చెప్పాడు. రహస్యాల్ని చీల్చి చూడడంవచ్చు కాళోజీకి. రహస్యంగా మన గుండెకు అందేట్టు చెప్పడమూవచ్చు. వేమనకూ ఈయనకూ రేఖామాత్రంగా వ్యత్యాసం ఉందేమోగాని అతను చెప్పడానికి వీలుగానివి కాళోజీ చెప్పంది తప్పలేదు.

అందుకే కాళోజీ ౨౦వ శతాబ్దంలో తెలంగాణా ప్రప్రథమ ప్రజా కవి. కాదనడం సాహసం. ఔననడం నిజాన్ని పరిగ్రహించడం. లుప్తం కాని వస్తువూ, లోపంలేని సృష్టీ వుండవు. కావ్యసంసారములోనూ లోపాలు వుంటాయి. అపి ప్రతిభావంతుడైన కవిబ్రహ్మ కవితాతేజస్సుకు లొంగిపోయిన క్రీనీడలవలె పడివుంటాయి. కవిత్వానికి ఏవి లక్షణాలో ఏవి కావో తన "సరస్వతీ భక్తుల్లారా!" లో సుస్పష్టంగా చెప్పి మన సందేహాలకు సమాధానాలు సమకూర్చిపెట్టాడు.

కాళోజీ కావ్యసంపుటి చదివాక ప్రజలకు దగ్గరగా పోగల కావ్య రచనా విధానాన్నిగూర్చి కవులుచేసే పరిశోధన ఫలించిందనిపించకతప్పదు.

కాళోజీ అనగా కల్లలకూ కపటాలకూ లాలోచీపడని జీవితం అని అర్థం. అతని గేయాలకుగానీ, అతనికిగానీ అర్థం చెప్పవలసిన అవసరమే లేదు. అసలు అవే అర్థంగాని ఈ సమాజపు మహాగ్రంథానికి విపులమైన టిప్పణీవంటివి.

ఆడంబరంలేని అలంకారాల ఆరభటి లేని నిసర్గమైన కృతి కాళోజీ కావ్యసంపుటి.

తెలంగాణా రచయితలసంఘం,
౬ — ౧ — ౫౩
హైద్రాబాదు.

దాశరథి

# నమస్కారియం

ఏడాది తిరగకముందే కాళోజీ కవితాసంపుటి రెండవ ముద్రణను అందుకున్నది. ఏండ్లు పూండ్లు దాటినా అస్మదాదుల పుస్తకాల్లో ఏదీ రెండవ ముద్రణకు రాలేదు. 'నా గొడవ' కాళోజీగొడవ గాక యావత్ ప్రపంచం గొడవ అని శ్రీ. శ్రీ ఈ గ్రంథాన్ని ఆవిష్కరిస్తూ ఆలంపురం సభల్లో అన్న ఒక్కమాట దీని పునఃపునః ప్రచురణావసరాన్ని చెప్పడానికి చాలును. రెండోముద్రణ మరీ సుందరంగా సుసంపూర్ణంగా జరుగుతున్నందుకు హర్షిస్తున్నాను. ఒక నూరు ముద్రణలు జరిగి నూరేళ్ళపాటు ఈ కావ్యం జనానికి అందుతూపోయినా దీనిపని ముగిసిపోదు. ఇది సార్వకాలికం, సార్వజనికం. కాళోజీ రచనల్లో తథ్యగవేషణాత్మకమైన శక్తి వుంది. ఈ శక్తి కవిని నిష్పాక్షికుణ్ణి చేస్తుంది. నిష్పాక్షికుడైనవాడే ఒక వస్తువును నిశితంగా అన్నిపక్షాలనుంచీ చూడగలుగుతాడు. అట్లా చూచినప్పుడుగాని అందులోని మంచీ, చెడూ సుస్పష్టంగా కంటికి కనిపించవు. దర్శనం అంటే ఇది.

మనోవిశ్లేషణవాదం భూత, వర్తమాన, భవిష్యత్ కాల పరిధులను ఒప్పుకోదు. మనస్సు నిస్సీమంగనుక కాలమూ నిరవధికమే. మనోవర్ణనం తెలిసిన కాళోజీ వంటి కవులు నిరాశాదురాశలను నిశ్చిత దృష్టితో చూడగలరు.

"ఉదయం కానేకాదనుకోడం నిరాశ
ఉదయించి అట్లానే వుంటుందనుకోడం దురాశ"

అంటున్నాడు కాళోజీ.

మనవూరి పక్కన పారేనది శతాబ్దాలు ప్రవహిస్తూనేవుంటుంది. అదేగట్టు, అదేచెట్టు, అదేమిట్ట. అయితే నదిలోని జలం ఒక్కక్షణం ఒకచోట ఆగడంలేదు. కాలమూ ఇంతే అని చెబుతున్నాడు కాళోజీ. ఈయన చెబుతున్న వర్షధారా జలం నిర్మలమూ, నిర్వర్ణమూ, నిర్గంధమూ,

అయిన సత్యం మానవత్వం పదికాలాల పాటు లోకంలో నిలిచివుండ డానికి జీవన ప్రదానంచేస్తుంది.

"నరుడనేను" అనే శీర్షికక్రింద
"ఇచ్ఛయె నా ఈశ్వరుడని
ఖచ్చితముగ నమ్ముతాను"

అంటాడు. "మానవుడికిగల "ఇచ్ఛ" తారకామండలంవలె అతిప్రాచీనమూ, అత్యంత క్రమబద్ధమూ" అంటాడు క్రిస్టాఫర్ కాడ్వెల్. ఇచ్ఛ లేక మాన వత లేదు. ఇచ్ఛయే ఈశ్వరుడు. నిజం.

కృత్రిమాల బరువులక్రింద నలిగిపోయిన నిసర్గ సత్యాలు కాళోజీ కవితా తంత్రులనుండి విద్యుత్తువలె ప్రసరించి మన అంతశ్చేతనను తటాలున కదల్చివేస్తాయి. కృత్రిమాల బరువులతో కదలలేకుండా స్తబ్ధమై పోయిన హృదయ భారాన్ని భరించలేనంటాడు. సంచలనంలేని హృదయం అక్కరలేదంటాడు. బైరన్ వలె "నరుడ నేను" అనే గేయంలో—

"కదలలేని కదపలేని
ఎదబరువును మోయలేను."

కన్నీరంటే వూరికేరాదు. హృదయం వేదనా వహ్నిజ్వాలా దగ్ధమై అందులోంచి కరిగి జారిన బాధాకణాలు కన్నీరు. ఆ కన్నీటిలో ఎన్నో వున్నాయి.

"కన్నీటిలో ఎన్నెన్నో కలవు" అన్న గీతి మనలో మనం పాడుకుని వింటే కన్నీరు పొరలి పొరలి వస్తుంది.

కాళోజీ వానకాలం మబ్బువంటివాడు. కరుణారసం మెండు. దీనికి శోకం స్థాయి. లోకంలో ఎక్కడ ఏదౌష్ట్యం జరిగినట్టు విన్నా, కన్నా భరించలేడు. కన్నీరై కరగిపోతాడు. అయితే కారుణికుడు పిరికివాడుకాడు. నిర్దాక్షిణ్యంగా నిజంచెబుతాడు. రహస్యాన్ని బ్రద్దలుకొట్టి మనకుఅందిస్తాడు.

"ఎవరికి చేవని ఎండిన చన్నులు
రసవిహీనములు రాజకీయములు."
"అన్ని బాధలకన్న అధికమౌ బాధ
ఉన్న బాధల నోర్వలేనట్టిబాధ."

"బాపూజీ బ్రతికిన యప్పటి
సత్యాహింసల దుప్పటి
బొంకుల బొంతగ మారెను
ఘనతలు సాంతము తీరెను."
"శాంతి సభలు సంధి చర్చ
సంఘర్షణ పూర్వావధి."

ఇట్లా ఎన్నెన్నో విచిత్రాంశాలను ఈయన కవితలో అడుగడుగునా చూపవచ్చు. తెలంగాణంలో పలువురి మన్ననలందిన "ఏమేటా ఎందుకు నీ పాటా", "పోటీపడి కాటులాడ", "వికృతి", "మారురూపాలు", "మంచి చెడ్డల అండ" మున్నగునవి వ్యంగ్యాత్మక విమర్శాయుత గీతాలు. చాలా సున్నితమైన ఈయన గేయాల్లోని వ్యంగ్యం సూదంటురాయి వలె పాఠకుడి హృదయాన్ని అంతలో లాగివేసుకుంటుంది. ఫక్కున నవ్వుతాడు పాఠకుడు. ఆ నవ్వులో ఎక్కడి నరాలు అక్కడ సడలిపోయి హృదయంమీద భారం జారిపోతుంది. మానవుడి అంతశ్చేతనలో ఖైదీగా పడివున్న "సత్యం" ఒక్కగంతులో బయటపడుతుంది. వ్యంగ్యాత్మక విమర్శాయుత హాసగీతికలు రచించి కాళోజీ కవితా జగత్తులో క్రొత్త విప్లవాన్ని కలిగించాడు. ఇది నిస్సందేహంగా మానవుణ్ణి వికాసోన్ముఖుణ్ణి చేస్తుంది. ప్రజాబాహుళ్యానికి ఆదరణీయంగా వుంటుంది.

తెలంగాణం మధ్యయుగాల బర్బర పాలనక్రింద నుసినుసి అయిననాడు వజ్రశంఖంవంటి తన కంఠాన్ని మ్రోయించిన కాలాన్ని ఈ సందర్భాన స్మరిస్తున్నాను. "తీర్పు" అన్న గేయం తెలంగాణా సాహిత్య విప్లవానికి మూలస్రోతస్సు. కాళోజీ చెప్పిందంతా అయింది. ఈ నాడు చెబుతున్నదంతా అవుతున్నది. ఆతడు చెప్పనున్నదే కానుంది. త్రికాలజ్ఞుడైన మహర్షి కాళోజీ.

తెలంగాణా రచయితల సంఘం
హైద్రాబాదు.
12-12-53.

దాశరథి.

# శ్రీ. శ్రీ ప్రశంస

"కాళోజీ నిఖిలాంధ్ర కవి. అందులో యెట్టి సందేహం లేదు. ఆయనకు తెలంగాణా అంచులు గోడలుగా అడ్డు నిలువజాలవు. ఆయన తన ఖండకావ్య సంపుటానికి 'నా గొడవ' అని పేరుపెట్టారు. అదే కవి యొక్క ప్రతిభ, అదే కవి చెప్పవలసిందీని. ఇది కవి గొడవగానే ననిపించి నప్పటికీ చదివినవారికి ఇది తమ గొడవగానే అర్థమవుతుంది. ఇది విశాల జగత్తు ప్రజలందరిగొడవ. ఇది మనం మననంచేసుకోవాల్సిన పుస్తకం.

"యుద్ధంలో ఫ్రాన్సు కవులంతా చెల్లాచెదరుగా పారిపోతే లూయీ ఆరగాఁ ఒక్కడే దేశంలో నిలబడి మహా ప్రజావిశ్వాసాన్ని వెల్లడించే గీతాలు వ్రాశాడు. కాళోజీ లూయీఆరగాఁ వంటివారు. అలా ఎవరికీ తెలియకుండా అజ్ఞాతంగానే ఉండి రచనను సాగించాడు. తెలంగాణా మూగజీవాల హృదయాల్ని ప్రతిబింబింపజేశాడు. ఈ పుస్తకాన్ని ఆవిష్కరించడానికి నాకు ఎంతో సంతోషంగా ఉంది."

("నా గొడవ" (ప్రథమ ముద్రణ) ను ఆవిష్కరణ జరుపుతు 12-1-53 ఆలంపురం సభలో)

ii

# గేయాల వరుస

పుట.

| | | |
|---|---|---|
| 1. | మాతృదేశము | 1 |
| 2. | లోకము | 3 |
| 3. | ప్రపంచము .... | 5 |
| 4. | అల్పాత్ములు—మహాత్ములు | 6 |
| 5. | వ్యత్యాసాలు .... | 7 |
| 6. | ఆంధ్రుడా! .... | 8 |
| 7. | దీపావళి దీపాలు .... | 10 |
| 8. | ఎందుకో నాహృదిని ఇన్ని ఆవేదనలు | 11 |
| 9. | కర్షకా! .... | 12 |
| 10. | ఇంకెన్నాళ్లు? .... | 13 |
| 11. | చాదస్తం .... | 15 |
| 12. | ద్వైతజగత్తు .... | 17 |
| 13. | వ్యర్థం .... | 19 |
| 14. | వసుధవీడ .... | 20 |
| 15. | ఏఁటేట ఎందుకు నీ పాట | 22 |
| 16. | 'నాయిజం' .... | 23 |
| 17. | అవసరాల వేట .... | 24 |
| 18. | లేకుంటేమి? .... | 25 |

| | | | |
|---|---|---|---|
| 19. | చాలింక | .... | 26 |
| 20. | కోటగోడలు నేల కూలుతున్నాయి | | 28 |
| 21. | ఓ రాజా ! | .... | 29 |
| 22. | తీర్పు | .... | 30 |
| 23. | జంట సింగిణులు | .... | 31 |
| 24. | హృదయ మాలిన్యము | .... | 32 |
| 25. | కాటేసి తీరాలె | .... | 33 |
| 26. | మంచి చెడ్డల అండ | .... | 34 |
| 27. | దేవతలెరుగని దివ్యానుభవము | | 36 |
| 28. | అవసరము | .... | 38 |
| 29. | మారురూపాలు | .... | 39 |
| 30. | కాలయాపన | .... | 40 |
| 31. | నగ్నసత్యాలు | .... | 41 |
| 32. | ఏదైననేమి ? | .... | 43 |
| 33. | వయసు | .... | 44 |
| 34. | నేను........ | .... | 45 |
| 35. | కోకిలా ! | .... | 46 |
| 36. | సరస్వతీ భక్తుల్లారా ! | .... | 47 |
| 37. | కాలగతి | .... | 49 |
| 38. | నేతాజీ ! | .... | 52 |
| 39. | ఓటిచ్చినప్పుడే.... | .... | 54 |

| | | |
|---|---|---|
| 40. | ఈ అలజడి కొన్నాళ్లు .... | 55 |
| 41. | ఖర .... | 58 |
| 42. | మాంధాతలనాటినుండి .... | 59 |
| 43. | మహామహా మేధావులు .... | 60 |
| 44. | కన్నీటిలో ఎన్నెన్నో కలవు | 61 |
| 45. | చెమ్మగిలిన కన్నులలో .... | 63 |
| 46. | నరుడ నేను, నరుడ నేను .... | 65 |
| 47. | చంద్రుని సాక్షిగ .... | 68 |
| 48. | సంధ్యారూపం .... | 69 |
| 49. | నావరకు నేను .... | 71 |
| 50. | పోటీపడి కాటులాడ .... | 73 |
| 51. | బ్రతుకు .... | 75 |
| 52. | కన్నుపడినంతనే కడదొల్గిదాగెదవు | 76 |
| 53. | ఎవరనుకొన్నారు ఇట్లౌనని? | 78 |
| 54. | ఒంటరిని నే గాను .... | 80 |
| 55. | నిన్ను నీవే చూచుకొని .... | 81 |
| 56. | గణరాజ్యం .... | 82 |
| 57. | పునరావృతి .... | 84 |

# అంకితము.

ఎన్నేండ్లు వచ్చినను
చిన్న వాడనటంచు
అతిగారవముతోడ
నన్ని సమకూర్చుచు
ఆటలకు పాటలకు
నవకాశమిచ్చిన
అన్నయ్యకీ 'గొడవ'
అర్పితము చేతు.

# మాతృదేశము

మాతృదేశము మాట ముచ్చట
ముదముగూర్పదు మదిక ననియెడి
పరమనీచుడు ధరణినంతట
గలయవెదకిన గాననగునా ?
నీరులేని ఎడారియైనను
వాన వరదల వసతియైనను
అగ్గికొండల అవని యైనను
మాతృదేశము మాతృదేశమె.
దేశదేశము తిరిగిచూడుము
కొంత హాయియె కూర్చు మదికిని
నాల్గురోజులు నచ్చదేదియు
స్వర్గమే నపవర్గమేనియు.
తల్లి ఏడుపు తండ్రి కోపము
భార్య బిడ్డల ప్రణయపాశము,
ఇంచుకయు గణియింపనీయదు
మాతృదేశము మాతృదేశమె.
లాఠిదెబ్బల లక్ష్యమేమీ
కఠిన శిక్షయె కాదు కాదు
చావుకైనను జంకనీయదు
మాతృదేశము మాతృదేశమె.
పొట్టకన్నము, కట్టబట్టయు,
లేని బ్రతుకును లెక్కసేయక

యెచ్చటికి బోనిచ్చగింపము
మాతృదేశము మాతృదేశమె.
స్వర్గమే అపవర్గమేయని
చాటిచెప్పెదు జన్మభూమియె
పరులవశమున నరకకూపము
కన్న హేయము కఠినతరము.

కలిమి లేమి చేత వెలయు గాదె లోకము
మంచి చెడ్డ జంటపేర్ల మాయలోకము.
కలిమిగల్గువాని తప్పు గనక లోకము
వానికెపుడు బ్రహ్మరథము బట్టు లోకము.
పేదపైన లేని తప్పు బెట్టి లోకము
ఎచట నెత్తి గొట్టి నిల్వనీను లోకము.
సిరులుగల్గువాని పట్టు చేరి లోకము
దైవమనుచుకొల్చు కోరు దయను లోకము.
ధనవిహీను జేరనీను దరికి లోకము
పశువటంచు వాని గొంచెపరచు లోకము.
అన్నిలోట్లు పేద తీర్చనట్టి లోకము
కూలివెట్టికొంటి నను కొంచె లోకము.
తప్పులెక్క తిప్పుకొలత తప్పుతూకము
సాధనముగ ధనముగూర్చు చతుర లోకము.
ఉప్పుకొఱకె పేదలొందుచుండ శోకము
తన విలాసమునకె కుందు ధనిక లోకము.
కులము గుణము ధనము జూచి కొలచు లోకము
పేదకేమి కట్టునయ్య విలువ ? లోకము.
ఓగుకైననేమి కల్మియున్న లోకము
అవి ఇవేల ఇహపరమ్ములమ్ము లోకము.

మాయలోకము మాయజనుల
మనసులోగల మాట యొకటి

పైకి నుడివెడి పలుకు ఒకటి
చేయదలచిన చేష్ట యొకటి.
మనసులోగల మాట యేదో
పైకి పల్కుచు పల్కినట్టుల
చేసి చూపెడు శీలముంగల
మాయ యెఱుగని మానవునకు
సాటి లే దిల
చోటు లే దిల.

# ప్రపంచము

గడియ గడియకు మారు ప్రపంచము
గవ్వకునూ కొఱగాని ప్రపంచము
పారదోల పైబడెడు ప్రపంచము
కోరగనే కొమ్మెక్కు ప్రపంచము
వలదనగా మెడ బడెడు ప్రపంచము
వలచినచో వైదొలగు ప్రపంచము గ॥

అసపెట్టి యాడించు ప్రపంచము
మోసపుచ్చి ముఱిపించు ప్రపంచము
సమరాలకు సం యనెడి ప్రపంచము
శాంతి శాంతి యని చాటు ప్రపంచము గ॥

వక్రమార్గ వర్తనల ప్రపంచము
సక్రమ బోధల సల్పు ప్రపంచము
నీతిరహితమై నెగడు ప్రపంచము
నీతి నియముల నేర్పు ప్రపంచము గ॥

నిలువు దోపిడుల నిత్య ప్రపంచము
చిల్క పల్కుల బల్కు ప్రపంచము
వియ్యాలకు విచ్చేసి ప్రపంచము
కయ్యానికి కాల్దువ్వు ప్రిపంచము గ॥

దయాధర్మముల దండి ప్రపంచము
తడిగుడ్డల మెడగోయు ప్రపంచము
మనుజులచేతనె మనెడు ప్రపంచము
మానవునే మననీదు ప్రపంచము గ॥

## అల్పాత్ములు - మహాత్ములు

శాశ్వతము కానట్టి సంపదల సమకూర్చి
స్వార్థాలు సాధింప సమకట్టి భూనాథు
మన్ననల బడయుటకు మార్గముల వెదకుచు
పడరాని యగచాట్లు పడునట్టి ప్రాణుల
అల్పులగు మానవుల నడిగేదెవండు ?
పారమార్థ్యముపేర ప్రాపంచికము రోసి
పరలోకప్రాప్తికై పరమాత్మ సేవించి
స్వర్గసంపదలన్ని శాశ్వతముగా తమకు
ప్రాప్తించవలెనంచు పాటుపడు ప్రాణుల
అల్పులగు మానవుల నడిగేదెవండు ?
ధరనేలు ప్రభుగనక దైవచింతనలేక
స్వార్థభావము వీడి సకల మానవసేవ
యొనరించు యోగులే ఉర్వి దేవతలయి
ప్రజల పూజలనొంది ప్రభు మన్ననల బడసి
పరమాత్ము దయకును పాత్రులగు పావనులు.

అన్నపురాసులు ఒకచోట
ఆకలిమంటలు ఒకచోట
హంసతూలిక లొకచోట
అలసినదేహా లొకచోట
సంపదలన్ని యొకచోట
గంపెడుబలగం బొకచోట
వాసనసూనియ లొకచోట
మాసినతల లింకొకచోట
కమ్మని చకిలా లొకచోట
గట్టిదౌడ లింకొకచోట
బాహ్యబంధనము లొకచోట
భావబంధనము లొకచోట
కామిని వాంఛలు ఒకచోట
కౌగిలింత లింకొకచోట
తనువులు ఉండే దొకచోట
తలపులు ఉండే దొకచోట
కావ్యగానము లొకచోట
కావ్యపిపాసువు లొకచోట
కళాప్రదర్శన మొకచోట
కళారాధకులు ఒకచోట
సాహితీనిలయ మొకచోట
చదువరులంతిం తొకచోట
పెత్తనమంతిం తొకచోట
సత్తువ యంతింతొకచోట
అనుభవమంతా ఒకచోట
అధికారంబది యొకచోట.

## ఆంధ్రుడా!

ఏభాషరా నీది యేమి వేషమురా ?
ఈ భాష ఈ వేష మెవరికోసమురా ?
ఆంగ్లమందున మాటలాడ గల్గగనే
ఇంతగా గుల్కెదవు ఎందుకోసమురా ?
సూటు బూటు హ్యాటు షోకుగా దొడుగ
ఘనతేమి వచ్చెరా గర్వమేటికిరా ?
ఏభాషరా నీది యేమి వేషమురా ?
ఈ భాష ఈ వేష మెవరికోసమురా ?
ఉర్దు మాటలాడి యుబ్బుబ్బిపడుటకు
కారణంబేమిటో కాస్త చెప్పుమురా ?
లాగు షేర్వాణీలు బాగుండుననుచు
మురిసిపోయెదవంత మురిపమేమిటిరా ?
ఏభాషరా నీది యేమి వేషమురా ?
ఈ భాష ఈ వేష మెవరికోసమురా ?
నీవేషభాషలిల నిగ్గుదేలివవన్న
విషయంబు నీవేల విస్మరించెదురా ?
నీభాస దీనతకు నీవేష దుస్థితికి
కారకుడవీవయని కాంచవెందుకురా ?
ఏభాషరా నీది ఏమి వేషమురా ?
ఈ భాష ఈ వేష మెవరికోసమురా ?
నీవేషభాషలను నిర్లక్ష్యముగజూచు
భావదాస్యంబెప్డు బాసిపోవునురా ?

నీభాషయందును నీవేషమందును
అభిమానముడిగిన అనదవీవేరా ?
ఏభాషరా నీది యేమి వేషమురా ?
ఈ భాష ఈ వేష మెవరికోసమురా ?
దేశభాషలయందు తెల్గు లెస్స యటంచు
తెలుగుబిడ్డా ! యెప్డు తెలిసుకొందువురా ?
తెలుగుబిడ్డవురోరి తెల్గు మాట్లాడుటకు
సంకోచపడియెదు సంగతేమిటిరా ?
ఏభాషరా నీది యేమి వేషమురా ?
ఈ భాష ఈ వేష మెవరికోసమురా ?
తెలుగుబిడ్డడవయ్యు తెల్గు రాదంచును
సిగ్గులేక ఇంక జెప్పుటెందుకురా ?
అన్యభాషలునేర్చి ఆంధ్రంబురాదంచు
సకిలించు ఆంధ్రుడా ! చావవెందుకురా ?
ఏభాషరా నీది యేమి వేషమురా ?
ఈ భాష ఈ వేష మెవరికోసమురా ?

## దీపావళి దీపాలు

అమవసచీకట్ల నాకాశమునకంపి
మిఱుమిట్లుగొల్పేటి మెఱుపుదీపాలు
మిద్దెమేడలమీద మింటిచుక్కలదాక
వేయిరంగులవెల్గు వింతదీపాలు
ఊరివెలుపలనున్న పూరిగుడిసెలదూరి
లోనిచీకటి బాపలేనిదీపాలు
దోచిదాచినదెంతొ దుర్భాగ్యులకుజూప
ధనపూజచేయించు ధర్మదీపాలు
రక్కసునిచావుచే రంజిల్లెజగమంచు
కోటివెల్గులుచాటె నాటిదీపాలు
రక్కసులుబాధింప రక్షయేలేదంచు
కోటిరీతులచెప్పు నేటిదీపాలు.

## ఎందుకో నాహృదిని ఇన్ని ఆవేదనలు

అవనిపై జరిగేటి అవకతవకలు జూచి
ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు
పరుల కష్టముజూచి కఱగిపోవును గుండె
మాయ మోసముజూచి మండిపోవును ఒళ్లు
పతిత మానవుజూచి చితికిపోవును మనసు
ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు,

తప్పుదిద్దగలేను దారిజూపగ లేను
తప్పుచేసిన వాని దండింపగా లేను
కష్టపడువారలను కాపాడగాలేను
ఎందుకో నాహృదిని ఇన్ని ఆవేదనలు.

అవకతవకలు నేను సవరింప లేనపుడు
"పరుల కష్టాలతో పనియేమి మా క"నెదు
అన్యులను గణియైన హాయిగా మనలేను
ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు.

నర్తకుని నాట్యాలు గాయకుని గానాలు
వాదిత్రుని వాద్యాలు శిల్పకుని శిల్పాలు
చిత్రకుని చిత్రాలు అంగనల అందాలు
కందర్పు కయ్యాలు కవిరాజు కావ్యాలు
కర్షకా! నీకళ్లు కదలినన్నాళ్లె.
దాంభికుని ధ్యానాలు ఛాందసుని జాప్యాలు
తాత్వికుని తత్వాలు మాంత్రికుని మంత్రాలు
తాంత్రికుని తంత్రాలు
గురువుల గోప్యాలు గుడుగుడు గుంచాలు
దేవుళ్ల తిరునాళ్లు దివ్యనది తీర్థాలు
కర్షకా! నీ కళ్లు కదలినన్నాళ్లె.
ధార్మికుని దానాలు పండితుని భాష్యాలు
జ్యోతిషుని జోస్యాలు తార్కికుని తర్కాలు
వర్తకుని వాణ్యాలు వక్కీళ్ల వాదాలు
సైనికిని శౌర్యాలు యాంత్రికుని యంత్రాలు
యోధుల యుద్ధాలు రాజుల రాజ్యాలు
కర్షగా! నీ కళ్లు కదలినన్నాళ్లె,

## ఇంకెన్నాళ్ళు ?

నవ యుగంబున నాజీవృత్తుల
నగ్ననృత్య మింకెన్నాళ్ళ ?
పోలీసు అండను దౌర్జన్యాలు
పోషణంబొందే దెన్నాళ్ళ ?
దమననీతితో దౌర్జన్యాలకు
దాగిలిమూతలు ఎన్నాళ్ళ ?
కంచెయె చేనును మేయుచుండగా
కొంచకుండు టింకెన్నాళ్ళ ?
దొంగలు దొంగలు ఊళ్ళ పంచుకొని
దొరలై వెలిగే దెన్నాళ్ళ ?
బాధలుపెట్టి పలుకనీయని
పాపులభయ మింకెన్నాళ్ళ ?
హింస పాపమని యెంచు దేశమున
హిట్లరత్వ మింకెన్నాళ్ళ ?
పగటి దోపిడుల నాపగలేని
ప్రభుత్వముండే దెన్నాళ్ళ ?
ప్రజాదరణ గోల్పోయి దేశమును
పాలనజేసే దెన్నాళ్ళ ?
పగటివేసములు యెన్నివేసినా
పాపముదాగే దెన్నాళ్ళ ?
పాపపుకుండ బ్రద్దలుకాక
భద్రంగుండే దెన్నాళ్ళ ?
ప్రజానాయకుల ప్రకటన
తప్పను ప్రభుత్వపత్రా లెన్నాళ్ళ ?
ప్రతిష్ఠపేరట తప్పులదాచే
పాడుపద్ధతింకేన్నాళ్ళ ?

శాంతి భద్రతలపేర దుష్టతను
సమర్థించుటింకెన్నాళ్లు ?
తత్వభేదమని మనలో మనకీ
తన్నులాట లింకెన్నాళ్లు ?
సంఘసేవకులపై దౌర్జన్యము
సాగనిచ్చు టింకెన్నాళ్లు ?
విప్లవగాథలు వినుచు అందరు
వేచియుందు రింకెన్నాళ్లు ?
అగ్గికొండలో నగ్నిజ్వాలలు
అణగియుండు నింకెన్నాళ్లు ?
ఫలితములేక పాపులకొరకీ
పాడుకష్ట మింకెన్నాళ్లు ?
ప్రజాశక్తికి పరీక్షసమయము
ప్రతీక్ష మన కింకెన్నాళ్లు ?
దౌర్జన్యము నెదిరించక మనకీ
దాసోహం ఇంకెన్నాళ్లు ?
పురుషులపై కాపురుషులు
విజయము పొందుచుందు రింకెన్నాళ్లు ?
సంక్రాంతి పురుషుడు దుష్టతపైన
స్వారిజేయ డింకెన్నాళ్లు ?
కలముపోటున కదపజాలని
కావ్యగాన మింకెన్నాళ్ళు ?
కాళోజీకవి కైతలు వినియు
కదలకుందు రింకెన్నాళ్ళు ?

## చాదస్తం

ప్రతిచాదస్తం దేవుడే
ఏదో ఒకరూపంలో గోకుడే.
పుట్టుకతోనే పుట్టునీపుండు
అగపడక అంతరంగాననుండు.

భావానుగుణ్యం రూపం
శక్తి నిబట్టి సాక్షాత్కారం.
సిగముపూనిస్తుంది వుపాసన
గిట్టదుగిట్టదు మరొకవాసన.
రామభక్తుడైన హనుమడు
కృష్ణుని ఆనవాలుపట్టడు.
నస్యంజూస్తె యేవగింపు
జర్దారూపంలో గిట్టునుకంపు.
నామరూపాలు అనంతం
ఎవనిదివానికే వసంతం.

అనుభూతి వర్ణనాతీతం
'సత్యం శివం సుందరం'.
ప్రతిరంగాన దీనిదేచిక్క
గాయానికి కట్టనీదుపక్క.
హాయి. గోకినాకొద్దిహాయి
మంటను లెక్కింపని స్థాయి.
వ్యసనాలు, మహావ్రతాలు
వ్యక్తిగత చాదస్తాలు.

దరిదాపున చేరినమౌఢ్యం
వ్యాపింపజేయు నీజాడ్యం.
ముఠాబంధీ సిద్ధాంతాలు
ఈజాడ్యానివే వ్యాపకరూపాలు.
ఒకసిద్ధాంతము పూనినపుడు కసి
మరొకదానిని చేస్తుంది మసి.
ప్రబోధ నినాదాల పొరలు
గాలాలనుదాచే ఎరలు.
'భ్రమరకీటకన్యాయం'
రంగురుద్దుటకుసాయం.
ఊబిలోపడిన ప్రతివాడు
ఆనందాబ్ధిఅని అంటాడు.

# ద్వైత జగత్తు

కుటిలమతులు దేబెమొగాలు
జగతిలో రెండేరెండురకాలు.
చతురవర్గ విలాసంకొరకు
దేబెల సర్వస్వం ముడిసరుకు.
లోకమెపుడు చతురినిదే సొత్తు
లే దహాయకున కందులపొత్తు.
శాస్త్రకార్లు శాసనకర్తలు
జనులకు తాళీకట్టని భర్తలు.
చేయుటకై సామాన్యులలూటీ
చాణక్యుల మధ్యన పోటీ.
బిక్కమొగపు జనసముదాయం
టక్కరిబృందానికి తృణప్రాయం.
చతురులు చతురులు పోటీపడి
మూఢసముదాయాలకు గూర్తురురాపిడి.
చతురునిదే అన్నిట పైచేయి
అతడన్న పగలుకూడ రేయి.
దండెగొట్టు తెలివేచాలు
జోకవచ్చుగింజలు తాలు.
మేధావుల కార్యాచరణము
సామాన్యులపాలిటి మరణము.
టక్కరిదే అన్నిటజోరు
నూరారు ఆరౌతవినూరు.
పేర్లమార్పు కలిగించును మత్తు
తరచిచూడ సామాన్యుడె తొత్తు.

ప్రజాస్వామ్యం గణరాజ్యం
చతుర నాయకమ్మన్యుల భోజ్యం.
తోడేలు అండనున్న మేకలు
'బ్యా'అన్న ఊడిపోవు పీకలు.
తోడేలునుచంపి చిరుతపులి
మేకలమ్రింగి తీర్చుకొనునాకలి.
పాలితులపైజరిగే శోషణ
పాలకవర్గంచేసే పోషణ.
జనులకు సహింపరాని అన్యాయం
శాంతిభద్రతలు కాపాడే న్యాయం.
మంచితలపెట్టిన కొందరమాయకులు
త్రాగిరి విషం కొట్టించుకొనిరి మేకులు.
చెంపపైకొట్టజూచి రెండవచెంప
కొట్టుమన్న క్రైస్తునెత్తిన కంప.
సత్యాహింసల యేబదేండ్లకృషి
క్షణంలోఅయిపోయెను మసి.
బ్రతికినపుడు లేదు తోడునీడ
చచ్చిన అనుపించెను పోయెపీడ.
కలిగిన సంతోషాన్ని కప్పిపుచ్చి
మొసళ్ల కన్నీళ్ల వెళ్లబుచ్చి.
సానుభూతి సంతాపక సభల
శాంతింపజేస్తున్నారమాయకుల.
వహ్వారేకుట్ర. చలాకీ
అందించిరి గోడ్సేకు తుపాకీ.
అతడు అజాతశత్రువు యేకాకీ.

టక్కరితనమెప్పుడుండదు పొంగక ?
బిక్కమొగాలెప్పుడుండవు లొంగక ?
అనాదిగ రుజువగుచుండ నీమాట.
ఎందులకో కవివ్రాయుట ఈపాట.
బలం తోడుగాలేని న్యాయం
కవి కనిపెట్టిన గొప్పఉపాయం.
ఊరడిపోసిన పందిపిల్ల అరపు
పూజారికి చేయగలదా చెఱుపు ?
గంటములెన్నియో అరగను
కంటములేమాత్రము తరగెను.
మిన్నుముట్ట మున్నుబెట్టిన కేకలు
వక్రతలకు వేయజాలెనా బ్రేకులు ?
ఎలుగెత్తిపాడిన కంఠాలు
ఏపాటితీర్చె లోకుల తంటాలు.
ఇకపై చెల్లవని శ్రీశ్రీ అనినంత
మోసం, దౌర్జన్యం తగ్గినదెంత ?
"ఇకకానా ! ఇకపై చెల్లవు",
ఏమైనవి ఎందుకు చెల్లవు ?
"కవులకసలు లేను బుద్ధి"
అన్నవాడు మహాసుబుద్ధి.
వ్యవహారజ్ఞాన శూన్యులు
అలౌకికశిఖామణులు,
ఆకాశహర్మ్య నిర్మాతలు
గగన కుసుమ ఆఘ్రాతలు.

లేదు లేదు
మాకది
మచ్చుకైనను
లేదంటె
కలదు కలదు
హృదికలదు
ఎదకలదు
మారునది మారుస్తా
పరివర్తన పరుస్తా
ననుచుండిన
వ్యర్థజీవి
వసుధపీడ
వదిలెపీడ.
సాటిప్రజల
లూటిజేయ
పోటీపడి
కోటికిపడగెత్తిన
సేటుకడ
కూటిపేద
వకాలత్తు బుకాయింపు
శంఖనాదం
సందడణిగె
సన్నగిలె.

స్వార్థం
జీవితసారం
ప్రాణికాధారం
లేని సంసారం
గొప్పదనిచాటెడి
అలౌకికుడంతమగుట
అదృష్టం.

## ఏటేట ఎందుకనీపాట

ఏడు మారినా యీడు ముదిరినా
ఏమి మారినది యీలోకంలో ?
రాయిరువ్వినా రాకెటువిసరినా
గిట్టనివానిని కొట్టుటకేకద ।
కాలనడచినా కారుయెక్కినా
కోరినచోటికి చెరుటకేకద ।
ఫోయిచెప్పినా ఫోనుచేసినా
తలచినదేదో తెలుపుటకేకద ।
గేగుకొరికినా కేకునమిలినా
ఆకలిమంటను ఆర్పుటకేకద ।
కేకపెట్టినా కేబులిచ్చినా
ఆపదాపదని అరచుటకేకద ।
కన్నుగీటినా కమ్మవ్రాసినా
కాముకవృత్తిని కదపుటకేకద ।
ఆకుకట్టినా కోకచుట్టినా
తోచినకాడికి దాచుటకేకద ।
హారతిచ్చినా అడ్రెసిచ్చినా
పొగడిమనన్నల పొందుటకేకద ।

నాది నిత్యనూత్న వికసితజ్ఞానం
మీది "బుద్ధిజాడ్య జనితోన్మాదం."
నేనున్నదే నిలువదగినచోటు
అటునిటు పోయినచో లోటు.
ననుదాటిన భ్రష్టాచారం
వెనుకపడిన ఛాదస్తం.
నాకోపం స్వభావసిద్ధం
మీకైనను ఓర్పుండొద్దా?
నాకున్నవి అన్నియు హాబీలు
మీకున్నవి వ్యసనా లవి తగవు.
నాదంతయు up-to-date culture
Thus far and no further.
యిది గిదిగో చెలియకట్ట
కాదన్నవాని కన్నులు లొట్ట.
నానా 'యిజాల' కడుగునచూడ
'నాయిజం'దే అగుపడును జాడ.

# అవసరాలవేట

జీవి కవసరాలవేట
చీకటిలో పునుకులాట
ఎత్తువంతులది దారి
ఎరుగక పారు సవారి
పుట్టుదాది గిట్టువరకు
వెట్టిమోత కొరకు పురుకు
గగన కుసుమంబుల కొరకని
నగము క్రిందత్రవ్వట గని
పారే మేఘాలనీడ
బాపలేదు ఎండపీడ
ఎప్పుడో యొకింత హాయి
ఎడతెగని కష్టాలస్థాయి
ఈర్ష్యా స్పర్థల సరదా
హితభావన నామరదా
వెనకనుయ్యి ముందుగొయ్యి
పెనముపైబడిన పొయ్యి.

## లేకుంటేమి?

కనుల గుసగుస కనులు వినగల్గినాక
పలుకుల తేనియలు జిలకకుంటేమి ?
మనసు మనసూకలిసి మనగల్గినాక
దేహాల దాహాలు తీరకుంటేమి ?
ఆత్మసౌందర్యాల నరయ గలిగాక
కన్నులూ అందాల కాంచకుంటేమి ?
వావివరసలు లేక వర్తించినాక
"సప్తపది"ఘనతలకై చాటకుంటేమి ?
పడునవెల్ల వ్యర్థ పాటులయ్యాక
తారుణ్యకాండను దాచకుంటేమి ?
పండించు ప్రాణాలు పస్తుపడ్డాక
పాడు రాజ్యాన్ని కాపాడకుంటేమి ?
కనులుమూసియె యంత కాంచగలిగాక
వెలుగు కోరుచు వాని విప్పకుంటేమి ?
రక్షించువారలే భక్షించినాక
విష్ణువని రేని సేవింపకుంటేమి ?

## చాలింక

బాధ్యతలేని ప్రభుత్వ భటులు
పెట్టేబాధలు చాలింక
బాధ్యతగల పరిపాలనలేక
బ్రతికిన బ్రతుకులు చాలింక
హద్దుమీరి అధికారవర్గము
ఆడిన ఆటలు చాలింక
రాజు పేరట అరాజకమునకు
జరిగిన పూజలు చాలింక
రక్కసితనముకు పిశాచవృత్తికి
దొరికిన రక్షణ చాలింక
పాలనపేరట పల్లె పల్లెలో
జరిగే పాపము చాలింక
రక్షణకై ఏర్పడ్డ బలగమే
చేసే భక్షణ చాలింక
బీదల సర్వస్వముతో ధనికులు
చేసే బేరము చాలింక.
దొంగలంత దొరతనము పేరట
చేసినదోపిడి చాలింక.
పగటివేషములువేసి భిన్నముగ
దాచిన పాపము చాలింక,
వాస్తవంబును దాచిపెట్టెడు
తప్పుడువ్రాతలు చాలింక.

లంచము నోరికిన యంతనె న్యాయము
తలనువంచడము చాలింక
'మూతులునాకుచు' ఆత్మవంచనతో
కట్టిన మూటలు చాలింక.
కాలమువ్యర్థము జేయగ కళయని
వ్రాసేకైతలు చాలింక.
కైతచేత మేల్కొల్పకున్న
కాళోజి కాయము చాలింక.

# కోటగోడలు నేలకూలుతున్నాయి

అధికారమున్నదని హద్దుపద్దులేక
అన్యాయమార్గాల నార్జింపబూనిన
అచ్చివచ్చేరోజు లంతమైనాయి
అచ్చివచ్చేరోజు లంతమైనాయి.
కాజేయువారలను కష్టించువారల
కంటబడనీకుండ కాపాడుచుండిన
కోటగోడలు నేల కూలుచున్నాయి
కోటగోడలు నేల కూలుచున్నాయి.
శస్త్రాలు నిర్మించి సైన్యాలు సమకూర్చి
ఉర్వినంతయుగెల్వ యుద్ధాలు ప్రకటించి
దుష్టశక్తులుపోరి దొర్లుపొయ్యాయి
దుష్టశక్తులుపోరి దొర్లుపొయ్యాయి.
దొరల దెబ్బలుతినుచు గురువు సాపెనవినుచు
'దాంచెనయ్యా' యనుచు ప్రణమిల్లు ప్రాణాలు
ఇప్పుడిప్పుడె తెప్పరిల్లుచున్నాయి
ఇప్పుడిప్పుడె తెప్పరిల్లుచున్నాయి.

రాణి వాసములోన రంజిల్లురాజా
రైతు బాధలదీర్చి రక్షింపలేవా ।
పట్టణపు సొగసుకై పాటుబడు రాజా
పల్లె కందముగూర్చ ప్రతిభయేలేదా ।
భూములన్నియునీకు భుక్తమైనట్లు
పల్లె బీదలబాధి పన్నులాగెదవా ।
పోషించువాడవని పూజించుజనుల
పీఠమెక్కినదాది పీడించుటేనా ।
సామాన్యజనులకు చైతన్యమొదవ
చతురంగ బలముండ జంకేలరాజా ।
ప్రజలను హింసించు ప్రభువు మాకేల
వధియింప భక్షింప వనరాజులేడా ।

# తీర్పు

ప్రజాసంస్థపై పగసాధించిన
ఫలితము తప్పక బయటపడుఁ.
నిక్కిచునీల్గే నిరంకుశత్వము
నిల్వలేక నేలనుగూలుఁ
చిలిపిచేష్టకై చిల్లిపొడచినను
స్థిరమగు కట్టయు శిథిలమగుఁ.
ఎట్టకేలకు గట్టిగోడలను
తట్టుకొనక భూమట్టమగుఁ.
కూర్చొనియున్న కొమ్మను నరికిన
కూలదెట్లు కొమ్మయుతానుఁ.
తానితరులకై తవ్వినగోతిలో
తనకేతెలియక దబ్బునకూలుఁ.
ప్రజాశక్తిపై పందెమువేసిన
ప్రభుత్వ మేపాటిగ నిల్చుఁ.
నివురుగప్పిన నిప్పునువూదిన
నిండవెలిగి నింగినిముట్టుఁ.
బేజారైన బీదల వోపిక
పెద్దలపై పిడుగయిరాలుఁ.
'అయ్యబానిస'ను అనినపౌరుడే
అయ్యగొంతుక నట్టెఅదుముఁ.
భస్మమొనర్చె వరములబొందిన
భస్మాసురుడే భస్మంబాయెఁ.
కానున్నదికని కాళోజీకవి
కైతలోపల ఘాటుగచెప్పుఁ.

# జంటసింగిణాలు

దానిమ్మగింజలో దాగిన యెరుపు
లేత అరిటాకు పైపూతల నునుపు.
క్రొత్త మఖమలులోని మెత్తందనాలు
కన్నతల్లిపాల కమ్మందనాలు.
గోదుగ్ధధారల గోర్వెచ్చదనము
ద్రాక్షఫలములలోన ద్రవియించుతీపి.
పువ్వు పొదుగుల్లోన పొంగేటి తేనె
ముసి ముసి నవ్వుల కుసుమముల సొంపు,
అందచందాలొక్క ఆనందఝురులు
చంటిపాపని పెదవి జంటసింగిణులలో
అన్నిచేరి ఆటలాడుతున్నాయి.

## హృదయమాలిన్యము

మానవుని మానవుడు మానవుని మాదిరిగ
మన్నించలేనంత మలినమైనాది
మానవునిహృదంబు మలినమైనాది.
జాతియని రీతియని దేశమని వేసమని
విసముగ్రక్కె వింతబిసగ మారినది.
మానవుని హృదయంబు మలినమైనాది.
ఆధునిక ఆర్భాట మందణిగి అవనియే
ఆత్మజచ్చి జనుల అడవియైనాది
మానవుని హృదయంబు మలినమైనాది.

మన కొంపలార్చిన మనస్త్రీల చెరచిన
మన పిల్లలను చంపి మనల బంధించిన
మానవాధములను మండలాధీశులను
మరచిపోకుండగ గురుతుంచుకోవాలె
కసి ఆరిపోకుండ బుసకొట్టుచుండాలె
కాలంబురాగనే కాటేసితీరాలె.
'సత్యమ్మ హింస'యని సంకోచపడరాదు
'దయయు ధర్మం' బనుచు తడుముకో పనిలేదు
'శాంతి'యని చాటినను శాంతింపగారాదు
'క్షమ'యంచు వేడినను క్షమియింపగారాదు
'చాణక్యనీతి'నా చరణలో పెట్టాలె
కాలంబురాగనే కాటేసితీరాలె.
తిట్టిననాల్కలను చేపట్టి కొయ్యాలె
కొంగులాగినవ్రేళ్ల కొలిమిలోపెట్టాలె
కన్నుగీటినకళ్ల కారాలు చల్లాలె
తన్నినకాళ్లను 'డాకలి'గ వాడాలె
కండ కండగికోసి కాకులకు వెయ్యాలె
కాలంబురాగనే కాటేసి తీరాలె.

దేశాలు తిరిగితేనేమి
వేషాలు వేసితేనేమి
రాగాలు మారితేనేమి
వేగాలు పెంచితేనేమి
నా మంచి చెడ్డలు
నన్నంటియుండగ.
ఏరివేరి క్రొత్త
పేరుపెట్టినయంత
పేరు మారునే
గుణము వేరౌట శక్యమే
నా మంచిచెడ్డలు
నన్నంటియుండగ.
మతము మారిననేమి
మతము మారిననేమి
రంగు మారిననేమి
హంగు మారిననేమి
నా మంచిచెడ్డలు
నన్నంటియుండగ.
కూత మారిననేమి
మేత మారిననేమి
రూపు మారిననేమి
దాపు మారిననేమి

నా మంచిచెడ్డలు
నన్నంటియుండగ.
పీతాంబరము వీడి
పేగు చుడితేమి
కొంప గోడు వదలి
కొండెక్కి తేనేమి
నా మంచిచెడ్డలు
నన్నంటియుండగ,

# దేవతలెరుగని దివ్యానుభవము

చెలిమియే కలిమిగా గలిగియుండుటను
చెలిమి మహిమనుకొంత చెప్పెదను వినుము
అక్కరలు దీర్చమని యడుగనక్కరలేదు
అడిగిననుయయ్యది యాచనసలేగాదు
అడుగకయె పొందినను యుపచారమునుగాదు
చేయి క్రిందాయెనని చింతింప బనిలేదు
చేయి మీదాయెనని చెప్పి యుబ్బుటలేదు
పిలువకయే బోయినను తలవంచ బనిలేదు
పిలుపు రాదాయెనని యలకబూనుటలేదు
కులముతో బనిలేదు గుణముతోడనులేదు
అందచందాలతో నావశ్యకములేదు
వయసుతో బనిలేదు వరుసతోడనులేదు
కలిమిలేములు రెండు కలిసి సయ్యాటాడు
పండితుడు పామరుని పల్కరించి మాటాడు
వ్రతము వ్యసనము కలిసి వల్లించు పాఠాలు
ఎట్టివ్యత్యాసమ్మొకించుకడ్డమురాదు
వంచింప పనిబూని పొంచియుండుటలేదు
తీయ తీయగబల్కి మాయజేయుటలేదు
తడిగుడ్డ పదునుతో మెడలుగోయుటలేదు
మొసలికన్నులనీటి మోసమించుకలేదు
నాటకపు వేషాల బూటకంబునులేదు
నచ్చజెప్పుచెకాని రచ్చకీడ్చుటలేదు
నీది నాదను భేదవాదమే లేదు

సంపూర్ణ సహకార సంఘంబు మైత్రి
స్వార్థరహితంబైన చరితంబు మైత్రి
పూర్వజన్మము సేత పుణ్యముల పంట
నేటి జన్మములోన నెచ్చెలుల జంట
మిట్టమధ్యాహ్నమున దట్టమగునీడ
మండువేసవిలోని మలయమారుతము
క్రుంగు యెదలకు శాంతి గ్రుడ్డిబ్రతుకుకు కాంతి
మానవత్వము మెఱుగు మర్త్యలోకపు వెలుగు
దేవతలె యెరుగని దివ్యానుభవము.

## అవసరము

నేడు నీ కింతటి సిగ్గు బిడియంబు
ఈడుమీరిన నిన్ను అడిగేదెవండు
ఏ చూపులకు కసిరి తల విసురుతావో
ఆ చూపులను తలచి నిట్టూర్చగలవు
తేప తేపకువీలు చిక్క దివ్యలమా ?
రేపు యీపాటికి ఎవ్వరెక్కడనో !
తుపానులో తెప్పదోనెల జంట
ఏపాటిదో ఏమో చెప్పనవసరమా ?
కామతృష్ణలతృప్తి కోరు దేహాలు
ప్రేమ గీమల గొడవలోన పడనేల ?
దేహాల దాహాలు తీర్చ జంకేల ?
మోహాలు జనియింప మొగమాటమేల ?
ఆకలికి అన్నంబు దొరుకవలెకాని
అడుగుకొని తింటేమి అర్తపెడితేమి ?
అరువుసొమ్మైతేమి అప్పుదై తేమి ?

## మారురూపాలు

సంఘాలు నియమాలు సాంప్రదాయాలు
మనిషిలోని కుళ్లు మారు రూపాలు
లంచాలు మంచాలు లాంఛనాలు కంచాలు
మనిషిలోనికుళ్లు మారురూపాలు
నేతిలోనికంపు నూనెలోని మడ్డి
కూరలోనిగడ్డి పాలలోనినీళ్లు
మనిషిలోనికుళ్లు మారురూపాలు

కూలిపోయిన కోటగోడలను జూపి
శిథిలమైన గుళ్ళ శిల్పముల జూపి
పగిలిపోయిన దైవ ప్రతిమలనుజూపి
చినిగిపోయిన పాతచిత్రములజూపి
మాసిపోయిన రాజశాసనముజూపి
పురుగుపట్టిన తాటిపొత్తములజూపి
తుప్పుపట్టిన కత్తితునకలనుజూపి
పూర్వగాథలుచెప్పి పొంగేటినీకు
ప్రస్తుతావస్థ యేపగిది నున్నదియో
ఎట్లు కన్పట్టు నీకేమి చెప్పుదును ?
ప్రస్తుతపు దీనతను పాటించకుండ
ఉన్నతిని పొందుటకు ఉబలాటపడక
అన్యాయమైనను అలజడియెలేక
దౌర్జన్యములకోర్చి దాస్యజీవనము
గడపునీకలనాటి గాథలేటికిరా ?
ఆత్మవిశ్వాసము ఆత్మగౌరవము
ఏనాడో కోల్పోతిమి మీనాడు మనము
భావదాస్యముచేత బంధాలచేత
పిన్నలము పెద్దలము పిరికిపందలమై
స్వార్థాలు సాధింప సందేహపడక
ఏమేమి చేయుదుమొ ఎట్లు చెప్పుదును ?

ఉత్తమాటలు కట్టిపెట్టి
పెత్తనాలకు దేవులాడక
చిత్తశుద్ధిగ చేయఁబూనిన
చేతలెల్ల ఘటించినట్లే
న్యాయమును పాటింపనొల్లని
ఆధిపత్యము అండయుండిన
హత్య, దోపిడి, మానభంగాల్
నిత్యకర్మల చేరినట్లే
రక్షణకు ఏర్పడ్డబలగము
రక్కసుల పక్షంబు చేరిన
రాక్షసుల యిష్టానుసారం
రాజ్యమును నడిపించినట్లే
పట్టపగలే పట్టణంలో పట్టి
పౌరుల కొట్టి చంపిన
దుష్టకూటముతో ప్రభుత్వం
దొంగబేరము చేసినట్లే
దుష్టులకు తావిచ్చి తోడై
శిష్టులను హింసించు తులువల
ఆధిపత్యములోన కులజులు
అనదలై జీవించినట్లే.
కడుపునిండని కాపు కాడవలి
కాసు దొరకని కూలి సుత్తి

కలిసి యెత్తిన దొంగ దొరలూ
కంపమెత్తి చచ్చినట్లే.
బూజుపట్టిన రాజ్యభారం
మోయజాలక జానపదులు
రోజుచుండే దేశమేలెదు
రాజు రోజులు నిండినట్లే.
కల్లగాదిది, కైతగాదిది
కాలదేవత గర్భవేదన
అరసి; కాళోజి వచించుట
అనుభవమునకు వచ్చినట్లే.

# ఏదైన నేమి?

విలపింపగా వేద నేదైననేమి ?
చితిని చేర్పగ చింత ఏదైననేమి ?
కొల్లగొట్టగ కొంప ఏదైననేమి ?
కోయదలచిన గొంతు ఏదైననేమి ?

దాకుడూయగ సాకు ఏదైననేమి ?
కడుపుమంటకు కబళ మేదైననేమి ?
తిట్టదలచిన దివస మేదైననేమి ?
చంపబూనిన సమయ మేదైననేమి ?
వ్యభిచరింపగ వరుస ఏదైననేమి ?

# వయసు

ఉన్న వంకల దిద్దిపోయేటి మిషతో
లేని వంకల తెచ్చిపెట్టేటి వయసు
కండ్ల గంతలతోడ గంతులిడుకుంటూ
కాంచేటి కండ్లలో కదలేటి వయసు.
ఆకాశ హర్మ్యాల అందు నాశలతో
అవనిపై కాల్మోపలేనట్టి వయసు.
గడియలో లోకాల కరగించు గర్వాన
కనురెప్పపాటులో కరిగేటి వయసు.
జంకినట్లై జంకి బెదరినట్లై బెదరి
జంకు బిడియములేక జంగలిడు వయసు.
గడుసుగుండెల్లో గగుర్పాటు జనియింప
గజగామినుల గంతులేయించు వయసు.
కంటిచూపులవాడి కవ్వాలనాడించి
గడుసు గుండెలలోతు కన్పెట్టు వయసు.
'మాట మంత్రీ' లేక మంత్రాలులేక
మానసాంబుధులనే మథియించు వయసు.

పీలున్న ప్రతిచోట విఱ్ఱవీగుచు అపర
హిట్లరౌతాను నే హిట్లరౌతాను.
తలదన్నువానికడ తలవంచి దయ అనుచు
గాంధినౌతాను నే గాంధినౌతాను.
మందితప్పుల ఏరి మనసుఖాతా నింపి
వడ్డి వడ్డీకట్టి వల్లింమతాను.
నాతప్పులనుదాచ నానారకాలైన
ధర్మసూత్రాలతో దడికట్టుతాను.

## కోకిలా!

లేమావి చివురులను లెస్సగా మేసేవు
ఋతురాజు వచ్చెనని అతి సంభ్రమముతోడ
మావికొమ్మలమీద మైమరచి పాడేవు
తిన్నతిండెవ్వారిదే కోకిలా!
పాడుపాటెవ్వారిదే కోకిలా!
పేరు ఊరూలేని పిచ్చికవు; దయదలచి
చేరదీసి నిన్ను గారవము చేసినా
మావిగున్నలమాట మాటవరుసకునైన
ఎన్నడైనను తలచితే కోకిలా!
ఎప్పుడైనను పాడితే కోకిలా!
ఇంపైన 'కూ కూ'ల సొంపైన రాగాల
నిండుగా నీగొంతు నింపిన మామిళ్ళ
మాటయే మరచి; మాలోని కొందరు చేరి
ప్రేమపేరిట కాదటే కోకిలా!
పెత్తనము నిచ్చారహో కోకిలా!
ఆమె నాదరియుండ హాయి చేకూర్చెదవు
విడిపోయి మేమేడ్వ విరహాగ్ని పెంచెదవు
ఆమె నాదరియుండ హాయి చేకూర్చుటకు
అన్యసాధనలేటికే కోకిలా!
విడిపోయి మేమేడ్వ విరహాగ్ని పెంచుటకు
అల్పబాధలవేటికే కోకిలా!
ఏనాటి సుకృతమొ? ఏ విశ్వకవి చలువొ?
ఈనాడు నిన్నింతదానిగా చేసినది
అంతకే నీవేడ ఆగలేకున్నావు?
లేకున్న నీలెక్క యెందులో కోకిలా?
లేకున్న నీవేడ నుందువో కోకిలా?

## సరస్వతీ భక్తుల్లారా!

కైతకు లక్షణాలున్నాయి కోటొక్కటి.
వానిలో వ్యాకరణంకూడా ఒక్కటి.
మీకు దాని సూత్రాలే సర్వస్వం ;
గొంతుకు పోసుకొని వ్రేలాడి సతతం,
చేస్తారు ఆక్రందన ; అంటారు కవిత్వం !
"కైతకు వ్యాకరణమే పరమావధి
కాదు అసలేకాదు" అన్నాడు దాశరథి :
మా రచనలో వ్యాకరణం మాత్రమేలేదు,
మీరచనంతా వ్యాకరణం : మరేమీకాదు.
వ్యాకరణ సూత్రాలు పెట్టితే భట్టి,
కాదెప్పుడు కైతపాకం గట్టి.
పాతబాటలబట్టియే నడువగలరు మీరు,
మా నడకలో పడుకుంది క్రొత్తత్రోవలకు తీరు.
శతాబ్దాల తరబడి ప్రవాహంలోపడి
రాపిడి పుణ్యాన రూపురేఖలు దిద్దుకొన్న
ముద్దువచ్చే రాళ్ళను శివలింగాలని
కన్నులకద్దుకొని భక్తులు పూజకై దాచుకొన్నట్లు
మానోట రాలిన మాట
ఆ నోటా ఆ నోటా
వినవింపై, మనసుకు పసందై
జపించి జపించి
సూత్రాలలో బిగించి
సారస్వత పూజాద్రవ్యంగా
భద్రపరుచుకున్నారు మీ వైయాకరణులు.
అప్పుడప్పుడు మేమన్నదే అయినది

మీ అప్పకవీయం, కౌముది,
సరస్వతీ భక్తుల్లారా !
బ్రహ్మనే వెక్కిరిస్తారా !
మెరుపువలె పరుగిడు
మా, ఊహాతరంగాలకు
బిక్కెద్దులనాపే
పగ్గాలు పనికొస్తాయా ?
హైడ్రాలిక్ బ్రేక్సుకూడా ఫేలవుతున్నప్పుడు !
ప్రళయ జలధిని నింపదలచిన ప్రవాహాన్ని
ఆపడానికీ మీ అనకట్టలు పనికొస్తాయా
హిమాలయ పర్వతపంక్తులే, తలలువంచుకుంటున్నప్పుడు ?
ఎన్నెన్ని జన్మాలెత్తి
ఎంత పొంకంగా రాసినా లేఖకుడు
మహారచయిత అనబడడు.
వలయాలూ, చతుర్భుజాలూ
వివిధ కోణాకారాలు
నీటుగా వేసే రేఖాగణితజ్ఞుడు
మహా చిత్రకారు డనబడడు.
చిత్రకారుడు గీసిన
జీవితముట్టిపడే చిత్తరువులో
అవయవాల సొంపునుజూపే
ఎత్తువంపుల కాధారమైన గీతలు
వంకరటింకరగా ఉన్నాయన్న లేఖకుడు--
మా రచనల్లో తప్పులున్నాయనే వైయాకరణి.

ఆయేడు పోతేమి
ఈయేడు వస్తేమి
మాయేడు పేదియో
మాతోడనే యుండ.
తరలి వచ్చినయట్లె
మరలిపోయెనుగాని
తారణ రవంతైన
తరియింప జేసెనా !
పాలింపజాలకయె
పార్థివయు వ్యయమాయె
వ్యయము గూర్చినమాట
వచియింప పనిలేదు.
సర్వజిత్తను పేరు
సార్థకతకై తాను
పొడిచి గెలిచినదేమి !
గడచి చెరిచినదేమి !
చింతాకు మందమున
చేయజాలక మార్పు
సర్వధారియు తాను
చనియె నందరియట్లె.
ఏడాదిపాటుండి
యెటుపోయెనో పాప

మావిరోధి విరోధ
మావంతయును తాను
వెంటగొని రాలేదు
వెంటగొని పోలేదు.
ఈనాడు వికృతి
తానే తెంచుచుండెనని
దిగులేల : యేనాడొ
జగము వికృతమాయె.
ఆగుటన్నది లేక
సాగిపోయెడు కాల
సరణిపై ఒక కొన్ని
గురుతురాళ్ళను నాటి
ప్రభవ యని విభవ యని
వాడుకొను టేగాని
ఇట శుభాశుభపు
మాటెలేదు నిజమెన్న.
రాకపోకలు
వత్సరంబులకు పరిపాటి ;
విధివ్రాత యని
యేడ్చు విధములను విడనాడి
తన బాధ్యత నెరింగి
తన విధిని నెరవేర్చు

క్రమశిక్షణకు

బద్ధకంకణుండగునాడె

లోకమున శుభము

చేకూరు నంతియె గాని

ఆయేడు పోతేమి

ఈయేడు వస్తేమి

మనయేడు పేదియో

మనవెంటనే యుండు.

దానిసత్వపు కారుచీకటి
పారదోలగ నుదయమొందిన
భారతజాతీయ జీవిత భానుడా!
ఓ బోసుబాబు
పట్టపగలే ప్రొద్దుగూకినదా?
పాడువాపుకు కండ్లు గుట్టినవా?
పేరు వూరు లేక పృథ్వికి
భారమైనా క్షుద్రజీవులు
పిరికిపందలు వేలు లక్షలు
చిరంజీవులుగా చరింపగ
వీరుడా నీకింత వేగిరమా?
కరుణలేని కాలనిర్ణయమా?
శుక్లపక్షపు రోజులందును
చూడ పున్నమరేయినాడే
కటికచీకటి క్రమ్ముకొనుటకు
కారుమబ్బులు కారణముగావా?
మామందభాగ్యమె కొంపముంచినదా?
మాచందురునకమావాస్య వచ్చినదా?
గాంధితాతతో జగడమాడి
గద్దెనెక్కిన గడుసుతనము
మాయకారి ఆంగ్లనీతిని
మాయజేసిన ఇంద్రజాలము
చావుకే చవిచూప జంకితివా?

చాలు ఈ జగమని తలంచితినా ?
చచ్చుపనులను చేయలేదని
చచ్చువాడవు కానె కావని
చావలేదని చావులేదని
చాటి చెప్పుచునుండ హృదయము
చచ్చువార్తల నమ్మమంటావా ?
స్వామీ ! వచ్చి దర్శన మివ్వనంటావా !

## ఓటిచ్చునప్పుడే ... ...

ఓటిచ్చు నధికార మున్నట్టివారు
ఎన్నికల సమయమున తిన్నగా వినుడు.
మట్టిబానలు కొనిన కొట్టిచూచెదము
సరుకుకొన వీథెల్ల తిరిగి చూచెదము.
పండు పండెనొలేదొ పట్టిచూచెదము
పరునన్ని విధముల తరచి చూచెదము.
ఓటువేయుట పిల్లలాట యెట్లగును ?
అభ్యర్థులై ఓటు లడిగేటివారు
ఏమేమిజేసిరో ఎటువంటివారో
సొరకాయకోతలకు మురిసిపోతారా ?
కర్రకొరకని జీలకర్ర గొంటారా ?
చెరుకు తీపని వంటచెరుకు నములుదురా ?
ఉప్పు కప్పూరంబు లుండు నొకతీరు,
గుణములజూచియే గుర్తింపవలయు
పురుషులెవ్వారు కాపురుషులెవ్వారు
గుర్తించి ఓటులను గురిపింపవలయు.
ప్రాణతుల్యము ప్రజాస్వామ్యమున ఓటు
వినియోగపరచుటకు అనువైన ఘడియ
ఏతెంచె నేతెంచె నిన్నాళ్ళకైన.
అనుమంటి నీమాట అనుభవముకొద్ది
ఓటిచ్చునప్పుడే ఉండాలె బుద్ధి
ఎన్నుకొని తలబాదుకొన్న నేమగును ?
తర్వాత ఏడ్చినను తప్పదనుభవము.

## ఈ అలజడి కొన్నాళ్ళు

బాపూజీ బ్రతికిన యప్పటి
సత్యాహింసల దుప్పటి
బొంకుల బొంతగ మారెను
ఘనతలు సొంతము దీరెను.
దానికి పడ్డవి చిల్లులు
దాచలేదు కల్లలు.
భక్తుల భజనల బడాయి
యుక్తుల అలజడి లడాయి
జయఘోషలు నినాదాలు
ఆటలు వ్రాతలు పదాలు
దానికి జవ తగ్గుతోంది
దండె యెటో మొగ్గుతోంది.
శివముబూని ఆడినను
ఒళ్లుమరచి పాడినను
వినువారలు తలలూపరు
చనువారలు నడకాపరు.
నిలబెట్టిన విగ్రహాలు
మార్చలేదు మన గ్రహాలు
పుట్టిన గిట్టిన దినాలు
దాపలేదు మన భయాలు.
జయంతులు వర్ధంతులు
దాపలేదు మన చింతలు.

కట్టిన స్మారక గృహాలు
తీర్చలేదు అవసరాలు.
రోగము పాతదేయనుచు
రోగియు పరిచితుడనుచు
మందులు పాతవి వాడిన
వెనకటి దేవుల వేడిన
పరిణామము నిండుసున్న
ఫలితము లేదుర యన్న.
పాతది ఏదైన రోత
కొత్తది వింతలపూత
ఎరిగిన ఎర మ్రింగవు చేపలు
చిరిగిన తెర ఆగవు చూపులు
కట్టాలిక క్రొత్తయెర
దించాలిక క్రొత్త తెర.
పాతఆట రతికట్టదు
పాతసరుకు ధరగిట్టదు.
మారాలిక లేబిల్ ప్యాకింగు
మారాలిక స్టేజుల సెట్టింగు.
యేడుతిర్గిన పంచాంగాలు
చూపవు తిథి వారాలు.
వినండి వినండి మ్రోత
మన నవనాయకుల కూత

దున్నేవానిదె భూమి
అన్నవాడే పురోగామి
వుండేవానిదె యిల్లు
అంటేనే మాటలు చెల్లు
అమ్మేవానిదె సరుకు
అనంది సాగదు బ్రతుకు
తోలేవానిదె బండి
యిదికూడ నిజము సుమండీ!
కోసినవానిదె పంట
అనకుంటే రాదా తంట ?
లేపినవానిదె మూట
అంటేమాత్రము చేటా ?
ఈ అలజడి కొన్నాళ్లు
క్రొత్తదేవర తిరునాళ్లు
పిళ్ళి అదే పాత కత
కాళ్ళోజీకేల వెత !

నరుని కాలమానంలో ఖరసంవత్సర మొకటా!
గాడిద పేరటగూడా ఏడాదొకటుండాల్నా!
బ్రతుకుల సామ్యం చూపే బాపత్తైతె కాదుగదా
చాకలి మారుటె గానీ చాకిరైతె తప్పదనా!
ముస్తాబుల తీరు మార మూటబరువు తగ్గదనా!
ఓపిక తగ్గియు మనిషి ఓండ్ర ఏల పెట్టడనా!
ఖ్యాతి కొరకా మేత కొరకా చేతగాని చేతజేసి
చేష్టైనను రోతైనను మూటయేల దింపడనా!
అరవదేండ్ల కొక్కసారి ఆదర బాదర పడుతూ
తనమాదిరి దీనులపై దయచూపగ రాదుగదా!
కార్యదీక్ష సహనశక్తి కలిగిన చాలదు చాలదు
పేరు ప్రతిష్టలు బడసిన వారలకే గౌరవాలు.
అనామకుని ధీశక్తిని అడిగేవాడే లేడు
ఆడంబరయుక్తమైన పేడబొమ్మయైన చాలు.
బ్రహ్మరథం పల్లకీలు పగటి దివిటి గౌరవాలు
ఇంటింటా విగ్రహాలు ఏటేటా ఉత్సవాలు.
మాడుపొట్టతోడ తాను గాడిదచాకిరి చేయగ
తోకపూపి మూతినాకు తుచ్ఛులకే వైభవాలు.
వెన్నుపూస బొక్క విరుగ తన్నుకొని మోసినను
అనాదరణ అవహేళన సనాతనము ఈ జగాన.

## మాంధాతల నాటినుండి

ప్రపంచ చరిత్ర సాంతము
ప్రకటించు నొక్క విషయము
మాంధాతల నాటినుండి
మార్పులేదు యీ జగాన;
ధృతరాష్ట్రులు దుర్యోధనులు
కృత వర్మలు శకునులు శల్యులు
దుశ్శాసనులు జయద్రథులు
ద్రోణులు భీష్ములు కర్ణులు
పాంచాలులు కుంతులు
పాండవులు శిఖండులు
పదేపదే పుట్టుచు పెరుగుచు
పదేపదే తరగుచు విరుగుచు !
శల్యరాజు సారథ్యము
కౌరవపతి కౌగిలింత
పూతనసతి పోతపాలు
కంసుమామ గారవంబు
పైమెరుగులు లోమరుగులు
విషపునవ్వు వెక్కిరింత
దొంగనవ్వు దొంగేడుపు
ముసుగుల్లో గుసగుసలు
ప్రపంచ చరిత్ర సాంతము
ప్రకటించు నొక్క విషయము
మాంధాతల నాటినుండి
మార్పులేదు ఈ జగాన !!!

స్వార్థా మృత సిద్ధి కొరకు
ప్రపంచ సముద్రం మధ్య
ప్రజా మందరంచుట్టు
పథకాల పాముచుట్టి
మహామహా మేధావులు
మథనం జేయుచునుందురు—
ఒకే ఒక ప్రపంచ నినాదం
ఒక్కొక్కని దొక్కొక్క ప్రపంచం
'సర్వేజనా సుఖినోభవంతు' లక్ష్యం
స్వార్థం ! స్పర్థ ! ఈర్ష్యలు ప్రత్యక్షం !

## కన్నీటిలో ఎన్నెన్నో కలవు

కన్నీటిలో ఎన్నెన్నో కలవు
కన్నీటిని కన కన్నులు కలవు.
మసిబారిన ఎడదల రుసరుసలు
కసితీరని పడగల బుసబుసలు
విసుగెత్తిన జీవుల విసవిసలు
పసిగొంతులు నలిగిన పిసపిసలు
రసమూరెడి చూపుల గుసగుసలు
కన్నీటిలో ఎన్నెన్నో కలవు
కన్నీటిని కన కన్నులు కలవు.
సెలవేసిన పీడల ములములలు
మొలపదలిన వలువల విలవిలలు
తలసూపెడి పదనుల జలజలలు
అలలెత్తిన నవ్వుల కిలకిలలు
వలచిక్కిన చేపల తళతళలు
కన్నీటిలో ఎన్నెన్నో కలవు
కన్నీటిని కన కన్నులుకలవు.
మతిచెరిపెడి పూర్వపు స్మృతిగతులు
వెతచెప్పక చెప్పెడు చతురతలు
దయకోరెడి గుండెల కుయకుయలు
నయమనుకొన కలిగెడు లయలయలు
కన్నీటిలో ఎన్నెన్నో కలవు
కన్నీటిని కన కన్నులు కలవు.

మటుమాయము జేసెడు మిటమిటలు
ఎటుతోచక కలిగెడు కటకటలు
కిటుకెరుగని కోపపు చిటపటలు
అటమటపడి దాచిన గుటగుటలు
కన్నీటిలో ఎన్నెన్నో కలవు
కన్నీటిని కన కన్నులు కలవు.
హడలెత్తిన ఎడదల గడగడలు
తడబాటులో దాగని దడదడలు
ఎడబాటులో కలిగిన గడబిడలు
మిడిమేలపు వంతల నడవడులు
కన్నీటిలో ఎన్నెన్నో కలవు
కన్నీటిని కన కన్నులు కలవు.

# చెమ్మగిలిన కన్నులలో

చెమ్మగిలిన కన్నులలో
కమ్మలెన్నో చదివినాను.
ఒలికి పారలేని బాధ
పలుకు జాలనీని గాధ
చిక్కి బయటపడెడి గుట్టు
బలిమి నెటులో దాచినట్టు
చెమ్మగిలిన కన్నులలో
కమ్మలెన్నో చదివినాను.
మనసుమాట మారలేదు
ఉనికితప్పి జారిపోదు
తనువు యిప్పుడు నీదికాదు
'మునుపు' తిరిగి రాదు రాదు
చెమ్మగిలిన కన్నులలో
కమ్మలెన్నో చదివినాను.
లోగా ఆడిన ఆట
సాగదనెడు గట్టిమాట
సైగచేయ వీలుపడక
మూగనుడుల జాలినడక
చెమ్మగిలిన కన్నులలో
కమ్మలెన్నో చదివినాను.
నలుగురివలె మనసుకూడ
వెలితిపడుట తగదుతగదు

కలితిలేని ప్రేమ మనది
కలకాలం మనగలదు
చెమ్మగిలిన కన్నులలో
కమ్మలెన్నొ చదివినాను.
చిత్తమెపుడు నీదెసొత్తు
చెత్త ఇపుడు పరుని తొత్తు
పల్లేరులు మదిని కెలక
మల్లెపూలమీది పడక
చెమ్మగిలిన కన్నులలో
కమ్మలెన్నొ చదివినాను.
చేరుకొంటి పరునిపంచ
కోరిగాదు పడకు కించ
'తాళి' పేర తలుగు పడగ
'కేళి' పేర గేలి జరిగె
చెమ్మగిలిన కన్నులలో
కమ్మలెన్నొ చదివినాను.
చెదరలేదు ప్రేమపటము
ప్రిదలలేదు ప్రీతిఘటము
ఎదుట ఉంతు ఎడద పలక
చదువుకొనుము చెలిమి వొలక
చెమ్మగిలిన కన్నులలో
కమ్మలెన్నొ చదివినాను.

## నరుడ నేను, నరుడ నేను

చెమ్మగిలని కనులు బ్రతుకు
కమ్మదనము చాటలేవు
చెమ్మగిలని కనులు బ్రతుకు
కమ్మదనము చూడలేవు.
దప్పితీర గ్రోలనిదే
విప్పారదు మనసు మబ్బు
తలపులన్ని తీరనిదే
తలుపులేవి తెరచికొనవు.
బిడియపడుచు జీవించిన
ఎడదమొగ్గ వికసింపదు
ముదముతీర ఆడనిదే
ఎద కదలదు కదపలేదు.
కదలలేని కదపలేని
ఎదబరువును మోయలేను.
మాయ మమత లేని వట్టి
కాయము కట్టెలచేటు
మమతయున్న మనసులోనె
సమతాభావము కలుగును.
మన్ను కానెకాను నేను
మనసువున్న మానవుడను
మమతలేని బ్రతుకు బ్రతక
విమనస్కుడ నే గాను.

నవ్వగలను ఏడ్వగలను
నరుడనేను నరుడనేను
అనుభూతియె ఎరుగనట్టి
అమరత్వము నే గోరను.
మనసులేని పుణ్యమందు
తనువు నెప్పుడు కట్టియుంచి
తనివిలేని చపట బ్రతుకు
ఘనమని భావించలేను.
పగవారారుగు ఏనుచు
వగలమాట లాడి యాడి
మనసులోని బాధ దాచి
మనుచు రోజు చావలేను.
నవ్వలేక ఏడ్వలేక
క్రొవ్వులోన లోన కరిగి
'హాయి' జాడ కనకుండనె
అవని విడిచి వెళ్ళలేను.
చవులుదీర బ్రతుకు బ్రతికి
చావదలచినాను నేను
చావరాకమున్నె పిరికి
చావు చావలేను నేను.
ఏవగింపు కలగనిదే
చావలేను తృప్తితోడ
బలము సన్నగిలక మున్నె
బులుపు తీర్చుకొందు నేను.

రేపటి బాధకు జడిసి
ఇప్పటి హాయిని వదలను
ఎపుడొ వచ్చు బాధకొరకు
ఇపుడె బాధ పడగలేను.
పరిణామము ఏదైనను
పరవాచేయను చేయను
కోటి బాధలైన యోర్తు
కోరిక తీరిన చాలును.
లోకేశునకును జడియను
లౌకికమని వెనుదీయను
ఆశలన్ని యుడుగునట్లు
హాయిగ జీవించుతాను.
ఇచ్ఛయె నా ఈశ్వరుడని
ఖచ్చితముగ నమ్ముతాను
ఇచ్ఛవచ్చినట్లు నేను.
ఆచరించి తీరుతాను.
గడిచినదేదియు తలపను
నడిచేదానికి వగవను
ఒరగనున్న దిది యది యని
ఊహాగానము చేయను.
సంతసముగ జీవింపగ
సతతము యత్నింతుగాని
ఎంతటి సౌఖ్యానికైన
ఇతరుల పీడింపలేను.

"వలపు తలపుల
వేలపు పాటలు
పతి పత్నీవ్రత
భంగపు ఆటలు
వికసించని సుమ
గంధపు దోపిడి
పక పక నవ్వేడి
పాపపు అలజడి
జరుగని చోటు
కని ఎరగం" అని
చంద్రుని సాక్షిగ
చుక్కలు చెప్పును.

## సంధ్యా రూపం

ఎన్నాళ్ళ ఎడబాటో
ఏనాటి గ్రహపాటో
తొలిచూపు త్రోపుతో
తొలిగె నన్యతలన్ని.
చిరకాల పరిచయపు
చిహ్నముల్ పొడసూపె
మెదడుకంతయు వింత
ఎదకెల్ల విదితంబు
సామీప్యమేగాని
సారూప్య మెరుగని
వెలుగునీడల జంట
వలె నుంటి మిన్నాళ్లు.
ఏకరూపత నొంద
లేకనే యిరువురకు
వేరు వేరుగ దోచి
భారమాయెను బ్రతుకు
వేలుపెట్టీ చూపి
వెక్కిరించుటకైన
వేఱు వేఱుగ నుండగా
వీలుపడునంతె.
నేను నీవూ కలియ
నేనెవరో నీ వెవరో ?

ఎరుగు సామర్థ్యంబు
ఏరికుండును సఖుడ ?
సంధ్య రూపము నెంత
క్షిఇంచి చూచినను
దినమేనొ రాత్రేదొ
కనుగొనా తరమౌన ?
ఉన్న వాస్తవ మేదొ
కన్నవారే లేరు !
చూచువారలు తమకు
తోచినట్లనుకొనిరి.
నేను నీవూ అసలు
లేనె లేనప్పుడు
నిన్ను నన్ను ఎవ్వ
రెన్నన్న నేమి ?

# నావరకు నేను

భావార్ణవంబులో
నావరకు నేను
మునకలేసి యెంతో
మురిసిపోతాను
మన మిరువురము కలసి
కొనిన సమయాల
ఆటలూ-పాటలూ
మాటలూ-పనులూ
ఎపుడెపుడు యేవేవి
ఎటుల జరిగినవో
ఎదలోన అటులనే
పదిల పరిచాను
స్మృతిచేత వానినే
వెతికించుతాను
వెతికించి మనసులో
అతికించుతాను.
తలచుకొని తలచుకొని
ఉలికిపడతాను
గుట్టు కనబడనీక
నిట్టూర్చుతాను
ముసిముసి నవ్వులను
విసురుకుంటాను

భావార్ణషంబులో
నావరకు నేను.
మునుపు గలిగినయట్టి
అనుభవాలెల్ల
అనుకుంటె అయినట్లు
అనిపించుతాయి
కనుల గట్టినయట్లు
కనుపించుతాయి.
వీనులకు విందుగా
వినిపించుతాయి
భావార్ణవంబులో
నావరకు నేను
మునకలేసినయంత
'మునుపు' 'యిపు' డౌను.

చాపచింపు సామ్రాజ్యం,
కోడిగుడ్డు కోహినూరు
పాటిమన్ను ప్లాటీనం
బస్సు సీటు బ్రహ్మరథం
ఏదైతేం ? ఏదైతేం ?
పోటీబడి కాటులాడ
ఏదైతేం ?
అడవిమనిషి ఆచార్యుడు
పసిబాలుడు పండుముసలి
బిచ్చగాడు లచ్చిమగడు
తొత్తుకొడుకు పెత్తనదార్
ఎవడైతేం ? ఎవడైతేం ?
పోటీబడి కాటులాడ
ఎవడైతేం ?
తండ్రి కొడుకు తల్లి బిడ్డ
అన్నదమ్ము లక్కచెల్లె
బావ మరిది భార్య భర్త
ఇరుగు పొరుగు ఎరుగనోరు
ఎవరైతేం ? ఎవరైతేం ?
పోటీపడి కాటులాడ
ఎవరైతేం ?
విఫణవీధి తపోవనం

చాకిరేవు శాసనసభ
సానికొంప సాధుమఠం
మూత్రశాల యాత్రాస్థలి
ఎచ్చైతేం ? ఎచ్చైతేం ?
పోటీపడి కాటులాడ
ఎచ్చైతేం ?

# బ్రతుకు

సాగిపోవుటె బ్రతుకు
ఆగిపోవుటె చావు
సాగిపోదలచిన
ఆగరాదిచ టెప్పుడు.
ఆగిపోయిన సుంమ
సాగనేలేవెపుడు
వేచియుండిన పోను
నోచుకోనేలేవు.
తొలగి తోవెవడిచ్చు
త్రోసుకొని పోవలయు
బ్రతుకు పోరాటము
పడకు ఆరాటము.
బ్రతుకదలచిన పోరు
సుతరాం తప్పదు
చూపతలచిన జోరు
రేపనుట ఒప్పదు.

## కన్ను పడినంతనే కడదొల్గి దాగెదవు

పాపినా నావింత పాపిష్ఠికండ్ల ?
కన్నుబడినంతనే కడదొల్గి దాగెదవు.
అందాలు చూచుటకు అల్లాడు నామనసు
అందమగుపడగానె ఆగిపోయెదనేను
అందమా నావల్ల నపచార మేమాయె ?
అందమా నాయందు అపరాధ మేముంది ?
పాపినా నావింత పాపిష్ఠి కండ్ల ?
కన్నుబడినంతనే కడదొలిగి దాగెదవు.
అన్నికాలములందు ఆనందదాయియగు
నందమగు వస్తువని యనె నొక్క ఆంగ్లకవి
అందచందాలన్ని ఆశ్రయించెను నిన్ను
కనులవిందైననూ కాగూడదా నాకు ?
పాపినా నావింత పాపిష్ఠికండ్ల ?
కన్నుబడినంతనే కడదొల్గి దాగెదవు.
జింకకన్నులు చూచి చెదరు నాగుండె
చూపులా సొగసైన చూడలేనా నేను
ఒయ్యారపున్నడల కోర్వలేనా నేను
నెమలినాట్యముజూచి నిల్వదా నామనసు
పాపినా నావంత పాపిష్ఠికండ్ల ?
కన్నుపడినంతనే కడదొల్గి దాగెదవు.
నాజాడ గనుదాక నాట్యాలు చేసెదవు
సిగ్గొచ్చి నవ్వెదవు చిలిపిగా కుల్కెదవు

నాజాడ గనినంత నడుము జవ్వాడగా
బెదరి బెదరీచూచి బిరబిరా పోయెదవు
పాపినా నావంత పాపిష్ఠికండ్ల ?
కన్నుపడినంతనే కడదొల్గి దాగెదవు.
నెమలి నాజాడగని నిల్పునా నాట్యాలు ?
చిలుకనే విందునని పల్కులే మానునా ?
హరిణి నే నెదురేగ అదరునా పారునా ?
కోకిలలు ననుగాంచి కూయుటలు మానునా ?
పాపినా నావంత పాపిష్ఠికండ్ల ?
కన్నుపడినంతనే కడదొల్గి దాగెదవు.
అగుపడని అందాలు ఆనంద మెట్లొసగు
అగుపడినమాత్రాన అందానికేమౌను
అన్యుడను గాబట్టి అంతగా భయమున్న
ఆదరించక నన్ను అంటరాదనవచ్చు
పాపినా నావంత పాపిష్ఠికండ్ల ?
కనులపడినంతనే కడదొల్గిదాగెదవు.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No. 10755

# ఎవరనుకొన్నారు యిట్లౌనని?

ఎవరనుకొన్నారు ?
యిట్లౌనని
ఎవరనుకొన్నారు ?
వానాకాలంలోను
చేనులెండిపోతాయని
మండే వేసవిలోవలె
ఎండలు కాస్తుంటాయని
ఎవరనుకొన్నారు ?
యిట్లౌనని
ఎవరనుకొన్నారు ?
సత్తా రాగనేకన్నులు
నెత్తికెక్కిపోతాయని
త్యాగులుసైతం గడియలో
భోగులయ్యిపోతారని
ఎవరనుకొన్నారు ?
యిట్లౌనని
ఎవరనుకొన్నారు ?
వెర్రితలల విజ్ఞానమె
వినాశనం దెస్తుందని
అణువు చిట్టి బ్రహ్మాండమె
అంతరించిపోతుందని
ఎవరనుకొన్నారు ?
ట్లాయనని

V.R. NARLA MEMORIAL LIBRARY
D.P.R.I.
Acc. No.

ఎవరనుకొన్నారు ?
చేతకు సిద్ధాంతానికి
చీమ ఏన్గు తేడాయని
వటసావిత్రీవ్రతము
వారకాంత చేస్తుందని
ఎవరనుకొన్నారు ?
యిట్లౌనని
ఎవరనుకొన్నారు ?

## ఒంటరిని నేగాను

ఏస్థితిలో ఉంటేమి ?
ఎచటనుంటే నేమి ?
ఒంటరిని నేగాను
జంటగా నావెంట
కంట తడిబెట్టుకొను
దంట నాకున్నాది.
బ్రతుకు బరువులు తరిగి
బంతిగా నున్నాది
పోనికష్టాలేవి పోకుంటెనేమి ?
రాని సౌఖ్యాలేవి రాకుంటెనేమి ?
ఒంటరిని నే గాను.
త్యాగాల నలిగి నే జోగినై పోతేమి
భోగాల మరగి నే రోగినై పోతేమి
సాదరంబున నన్ను
ఆదుకొని ఎల్లపుడు
తోడునీడై మెలగు
జోడు నాకున్నాది.
చిరపరిచితులు నన్ను
మరచిపోతేనేమి
కొత్తలంకెలు ఏవి
హత్తుకుంటేనేమి
ఒంటరిని నేగాను.

## నిన్ను నీవే చూచుకొని

నిన్ను నీవే
చూచుకొని
మురిసిపోకు,
నన్ను చూచి
హేళనగా నవ్వకు,
నీ ప్రస్తుతంపైన
పడను ఈర్ష్య
నీ భవితవ్యంపై
నాకు కలదు జాలి,
ఒకే ఒకేమాట
ఓపికతో వినుము కాస్త,
నా గతం నీ ప్రస్తుతం
నా ప్రస్తుతం నీ భావి.

హక్కుల పట్టిక.
లెక్క తప్పక
ఒప్పజెప్పెడి
ఉత్సాహం,
బాధ్యత అంటే
బానిసత్వమని
తర్కం, పనిలో
తాత్సారం.
జరిగేపనిలో
పొరపులు జూపి
అడ్డు తగిలెడి
ఆచారం,
కాయకష్టము
చేయడమంటే
దేబెతనంబని
తీర్మానం,
చాటుగ నేటుగ
చేటును గూర్చె
వ్రాతలు, కోతలు
వ్యాపారం,
పట్టి తన్నిన
పౌరస్వత్వములు
చెదరె నలిగెనని

చీత్కారం.
ఎవనికి వాడే
ప్రవక్త, వాని
పలుకే జ్ఞానపు
భాండారం,
కర్మకఠోరం
కళావేత్తలకు
తగదని, పనికే
ఎగనామం.
పూర్వభారతా
పూర్వవైభవ
గోష్ఠి గాథా
గుణగానం,
రష్యా అమెరిక
రహదారులపై
సర్వోదయ భావ
సంచారం.

## పునరావృతి

ఉదయం
కానేకాదనుకోడం
నిరాశ
ఉదయించి
అట్లానే వుంటుందనుకోడం
దురాశ
ఈచీకటి ఉండను
సూర్యుడు
తప్పక ఉదయిస్తాడు
ఆ వెలుతురు నిలవదు
సూర్యుడు
మళ్ళీ అస్తమిస్తాడు
చీకటిలో
కనువిప్పినవారికి
వెలుతురంటె బూచి
వెలుతురులో
కనుతెరిచినవారికి
చీకటంటె పిశాచి
ఇదే జరుగుతూవచ్చింది
ఇంతకుముందు
ఇదే జరుగుతుంది
తప్పదు ఇకముందు.

BCi

BC
AOUA105B149

# మా నూతన ప్రచురణలు

1. జైలులోపల (కథానికలు)
—శ్రీ వట్టికోట ఆళ్వారుస్వామి. 0-10-0
2. నా గొడవ (గేయాలు)
—శ్రీ కాళోజీ నారాయణరావు. 1-8-0
3. ఉదయ ఘంటలు (గేయాలు)
—అఖిలాంధ్ర కవులు. 2-4-0

## త్వరలో

1. ప్రజల మనిషి (నవల)
శ్రీ వట్టికోట ఆళ్వారుస్వామి.
2. ఆందోళన
(ప్రధాన రాజకీయ ప్రణాళికలు)
3. కూర్చిన ముత్యాలు
(ప్రముఖుల ప్రవచనాలు)
5. శ్రీ బాగి నారాయణమూర్తి రచనలు
(గేయాలు, కథలు, నాటికలు)
5. శ్రీ పొట్లపల్లి రామారావు రచనలు
(గేయాలు, కథలు, నాటికలు)
6. కళాదర్శనము :
(కాళోజీ, గార్లపాటి, దాశరథి, [illegible], పొట్లపల్లి, వానమామలై రచనలోని)

వివరాలకు :

దేశోద్ధారక గ్రంథమాల
(సర్వోదయ ప్రెస్)
మహంకాళి వీధి, సికింద్రాబాదు.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No.

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA105B149 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 103 |
| పెద్ద సైజు పేజీలు | |
| ఖాళీ పేజీలు | Ba |
| లేని పేజీలు | 1, 2, |
| తయారు చేసినది | [illegible] |
| పేజీలు విడదీసినది | Vedavathi |
| స్కాన్ చేసినది | Nandini |
| పరీక్ష చేసినది | SARANYA |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |